రూ.2,75,891 కోట్లతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్

- రెవెన్యూ వ్యయం రూ.2,01,178 కోట్లు
- మూలధన వ్యయం రూ.29,669 కోట్లు
- ఆరు గ్యారెంటీలకు రూ.53,196 కోట్లు
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.40,018 కోట్లు
- సాగుచేసే వాళ్లకు రైతు బంధు
- విద్యా, వైద్య రంగాల బలోపేతానికి కట్టుబడి ఉన్నాం
- బడ్జెట్ ప్రసంగంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2,75,891 కోట్లతో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శనివారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు..రెవెన్యూ వ్యయం రూ.2,01,178 కోట్లు, మూలధన వ్యయం 29,669 కోట్ల రూపాయలుగా ప్రతిపాదించారు. శాసన మండలిలో అసెంబ్లీ వ్యవహారాలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బడ్జెట్ ప్రతిపాదించి ప్రసంగించారు. శాసనసభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాతనే రాష్ట్రంలో కూడా పూర్తి స్థాయి బడ్జెట్ పెట్టాలని నిర్ణయించామన్నారు. కొంచెం అయిష్టంగానే దీన్ని ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యమే తమ బడ్జెట్ లక్ష్యమని నొక్కి చెప్పారు. ఆరు గ్యారంటీలను తూచా తప్పకుండా అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో విద్యా, వైద్యం, మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన, సమగ్రాభివృద్ధి సాధిస్తామన్నారు. గత పాలకులు ఓ ప్రణాళిక, హేతుబద్ధత లేకుండా ప్రభుత్వ ఖజానాను దివాలా తీయించారనీ, వారు చేసిన అప్పులు ఇప్పుడు పెద్ద సవాలుగా మారాయని చెప్పారు. అయినా, తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా, సహేతుంగా సవాళ్లను అధిగమిస్తుందని హామీ ఇచ్చారు. స్వేచ్ఛా తెలంగాణలో తొలి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నందుకు ఆనందంగా ఉందనీ, అందరికీ సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అందిస్తామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడమే తమ కృతనిశ్చయమన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వాస్తవాలకు దూరంగా ఉందనీ, రాబడిని అధికంగా చూపెట్టి ఎన్నో పథకాలకు నిధులు కేటాయిస్తున్నామని భ్రమలు కల్పించిందని విక్రమార్క విమర్శించారు.

ఆర్థిక వృద్ధి ఇలా..

2023-24 ఆర్థిక సంవత్సరంలో జీఎస్‌డిపి ప్రస్తుత ధరల్లో 2022-23తో పోలిస్తే రూ.13,02,371 కోట్ల నుంచి రూ.14,49,708 కోట్లకు పెరిగిందనీ, అదే కాలంలో రాష్ట్ర ఆర్థిక వృద్ధి రేటు 14.7 శాతం నుంచి 11.3 శాతానికి క్షీణిస్తే దేశీయస్థాయిలో అది 16.1 శాతం నుంచి 8.9 శాతానికి పడిపోయిందని భట్టి తెలిపారు. దేశ జిడిపి వృద్ధి రేటుతో పోలిస్తే రాష్ట్ర వృద్ధి రేటు 2.4 శాతం ఎక్కువని చెప్పారు. రంగాల వారీగా చూస్తే వాతావరణ పరిస్థితులు, నైరుతి రుతుపవనాల ఆలస్యం వల్ల వ్యవసాయ వృద్ధిరేటులో క్షీణత కనిపిస్తున్నదని చెప్పారు. విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, వాణిజ్యం, సేవారంగాల్లో కూడా తగ్గుదల కనిపించిందని వివరించారు. ఒక్క తయారీ రంగంలో మాత్రం వృద్ధి రేటు పెరిగిందని చెప్పారు.

సుపరిపాలన..అభయహస్తం

మేనిఫెస్టోలో ప్రకటించినట్టుగానే తమ ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నదని భట్టి తెలిపారు. ఆరు గ్యారంటీల కోసం 1.29 కోట్ల దరఖాస్తులు అందాయనీ, ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా వాటిని క్రోడీకరిస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకానికి సంబంధించి ఆర్‌టిసికి నెలకు రూ.300 కోట్ల చొప్పున నిధులను మంజూరు చేశామన్నారు. ఆస్పత్రుల్లో పేదలకు ఆరోగ్యశ్రీ సేవలు ఆగిపోవద్దనే ఉద్దేశంతో పెండింగ్ బకాయిలన్నీ విడుదల చేశామని చెప్పారు. త్వరలోనే గృహజ్యోతి కింద రూ.500 వంటగ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేస్తామనీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తామని హామీ ఇచ్చారు. ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో రూ.53,196 కోట్లు కేటాయింపులు చేస్తున్నామని ప్రకటించారు.

పారిశ్రామికాభివృద్ధితో ఉపాధి అవకాశాలు మెరుగు

రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందితేనే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయనీ, ఈ నేపథ్యంలోనే పరిశ్రమల శాఖకు 2,543 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నామని భట్టి చెప్పారు. చిన్న, సూక్ష్మ సంస్థలను స్థాపించడానికి వీలుగా క్లస్టర్లను అభివృద్ధి చేస్తామన్నారు. కాకతీయ టెక్స్‌టైల్ విస్తరిస్తామని తెలిపారు. ప్రాంతీయ, ఆర్థిక అసమానతలు తలెత్తకుండా రాష్ట్ర నలుమూలలా ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఐటీ శాఖకు ఈ బడ్జెట్‌లో 774 కోట్లు ప్రతిపాదిస్తున్నామన్నారు.

గ్రామమే యూనిట్‌గా అభివృద్ధి

గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికతో ముందుకెళ్తామని భట్టి విక్రమార్క చెప్పారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.40,080 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నామన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. దాని కోసం వెయ్యి కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నామన్నారు. పురపాలక శాఖకు రూ.11,692 కోట్లు ప్రతిపాదిస్తున్నామని చెప్పారు.

రుణమాఫీ అమలు చేస్తాం..
కౌలు రైతులకూ సాయం అందిస్తాం

రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ పథకాన్ని అమలు చేసితీరుతామని భట్టి నొక్కి చెప్పారు. రైతుబంధు పథకాన్ని పున:సమీక్షించి అర్హులైన సాగుచేసే రైతులకు రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. కౌలు రైతులకూ రైతు భరోసా సాయం అందిస్తామన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో వ్యవసాయ శాఖకు 19,746 కోట్లు ప్రతిపాదిస్తున్నామన్నారు. ధరణి పోర్టల్ సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకెళ్తున్నదని చెప్పారు.

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, మహిళా సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందనీ, ఎస్‌సి సంక్షేమం కోసం రూ.21,874 కోట్లు, ఎస్‌టి సంక్షేమం కోసం రూ.13,313 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి రూ.2,262 కోట్లు, బిసి సంక్షేమానికి రూ.8 వేల కోట్లు ప్రతిపాదించామని మంత్రి భట్టి తెలిపారు. ఎస్‌సి గురుకులాల భవన నిర్మాణాలకు రూ.1000 కోట్లు, ఎస్‌టి గురుకులాల భవన నిర్మాణానికి రూ.250 కోట్లు ప్రతిపాదించామన్నారు. బిసి గురుకులా సొంత భవనాల కోసం 1546 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నామని తెలిపారు.

విద్యా, వైద్య రంగాలకు పెద్ద పీట

తెలంగాణను ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చెప్పారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు స్కాలర్‌షిపులను సకాలంలో అందిస్తామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో మండలానికో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తామనీ, దీనికి బడ్జెట్‌లో రూ.500 కోట్లు ప్రతిపాదిస్తున్నామని తెలిపారు. ఉన్నతవిద్యామండలిని ప్రక్షాళన చేసి ప్రమాణాలను మెరుగుపరుస్తామనీ, దీని కోసం రూ.500 కోట్లు ప్రతిపాదిస్తున్నామని చెప్పారు. 65 ఐటీఐలకు ప్రయివేటు సంస్థల భాగస్వామ్యంతో బృహత్తరమైన ప్రణాళికను అమలు చేస్తామన్నారు. మొత్తంగా ఈ బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.21,389 కోట్లు ప్రతిపాదించామని తెలిపారు. వైద్యరంగానికి ఈ బడ్జెట్‌లో రూ.11,500 కోట్లను ప్రతిపాదించామన్నారు.

టీఎస్‌పీఎస్‌సీకి రూ.40 కోట్లను ఇప్పటికే మంజూరు చేశామనీ, నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా అది పనిచేస్తుందని మంత్రి విక్రమార్క తెలిపారు. తర్వలో 15 వేల కానిస్టేబుళ్ల రిక్రూట్‌మెంట్ పూర్తిచేస్తామనీ, గ్రూపు-1కి మరో 64 పోస్టులను అదనంగా చేర్చి ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పారు.

రాష్ట్రంలో సంఘటిత, అసంఘటిత కార్మికులకు అందించే సాయాన్ని మరింత పకడ్బందీగా అమలు చేస్తామని చెప్పారు. గిగ్ కార్మికులకు సామాజిక భద్రత పథకం కింద రూ.5 లక్షల ప్రమాద బీమాను వర్తింపజేస్తామన్నారు. గృహజ్యోతి పథకానికి బడ్జెట్‌లో రూ.2,418 కోట్లను, ట్రాన్స్‌కో, డిస్కమ్‌లకు ఈ బడ్జెట్‌లో రూ.16,825 కోట్లు ప్రతిపాదిస్తున్నామని చెప్పారు.

ఇందిరమ్మ ఇండ్ల కోసం రూ.7,740 కోట్లు

ఈ ఏడాది ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలనీ లక్ష్యంగా పెట్టుకున్నామనీ, ఈ పథకానికి బడ్జెట్‌లో రూ.7,740 కోట్లను ప్రతిపాదిస్తున్నామని మంత్రి విక్రమార్క తెలిపారు. ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ లైన్ కనెక్టివిటీని అభివృద్ధి పరిచేందుకు తమ ప్రభుత్వం పట్టుదలతో ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్ల కనెక్టివిటీనికి ప్రాధ్యాతన ఇస్తామని చెప్పారు.

నీటిపారుదల శాఖకు రూ.28,024 కోట్లు

ప్రస్తుత బడ్జెట్‌లో నీటిపారుదల శాఖకు రూ.28,024 కోట్లు ప్రతిపాదించామని మంత్రి తెలిపారు. కాంట్రాక్టర్ల కోసం ప్రాజెక్టులు నిర్మించే విధానం తెలంగాణకు శాపంగా మారిందని చెప్పారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ వాటా కోసం ఎంత వరకైనా పోయి కొట్లాడుతామని నొక్కి చెప్పారు. డాక్టర బిఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్లను పూర్తిచేసి ఎగువప్రాంతాలైన ఆదిలాబాద్, ఇతర జిల్లాలకు నీళ్లు అందిస్తామన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లబ్ది చేకూరే ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేస్తామని వివరించారు. దేవాదాయ భూములను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖతో కలిసి టెంపుల్ టూరిజం విధానాన్ని తీసుకొస్తామన్నారు. గద్దర్ పేరుతో చిత్ర, టీవీ కళాకారులకు అవార్డును అందించబోతున్నామన్నారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిరోధం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఇళ్ల స్థలాల్లో పేదలకు పొజిషన్ చూపాలి

- రెవెన్యూ మంత్రి శ్రీనివాసరెడ్డిని కలిసిన జగ్గారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని అలియాబాద్, సదాశివపేట మండలంలోని సిద్ధాపూర్‌లోని ప్రభుత్వ భూముల్లో పేదలకు గతంలో ఇచ్చిన ఇండ్ల స్థలాలకు పొజిషన్ చూపాలని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి మంత్రిని కోరారు. శనివారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని గాంధీ భవన్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పేదల ఇళ్ల స్థలాల సమస్య గురించి చర్చించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో తాను జగ్గారెడ్డి ఎమ్మెల్యేగా అలియాబాద్‌లోని ప్రభుత్వ భూమిలో నాలుగు వేల మంది పేదల్ని గుర్తించి ఇళ్ల స్థలాలు కేటాయించి లేఅవుట్ చేసి పట్టా సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్టు మంత్రి దృష్టికి తెచ్చారు. అదే విధంగా సదాశివపేట మండలంలోని సిద్ధాపూర్‌లోనూ ఐదు వేల మందికి ఇళ్ల స్థలాలిచ్చామని గుర్తు చేశారు. పేదలకు పంపిణీ చేసిన భూమి అలాగే ఉన్నప్పటికీ బిఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో వారికి పొజిషన్ చూపలేదని తెలిపారు. పైగా పేదలు గుడిసెలు వేసుకుంటే వాటిని గత ప్రభుత్వం తొలగించిందన్నారు. దీంతో ఇళ్ల స్థలాలున్నప్పటికీ పేద ప్రజలు ఇళ్లు కట్టుకోలేకపోతున్నారని గుర్తు చేశారు. రెవెన్యూ మంత్రిగా జోక్యం చేసుకుని వెంటనే పేదలకు ఇళ్ల స్థలాల్లో పొజిషన్ చూపాలని కోరారు. జగ్గారెడ్డి ఇచ్చిన వినతి పత్రాని పరిశీలించి సానుకూలంగా స్పందించిన రెవెన్యూ మంత్రి శ్రీనివాసరెడ్డి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఫోన్ చేసి మాట్లాడారు. వెంటనే పేదలకు పొజిషన్ ఇవ్వాలని ఆదేశించారు.

బడ్జెట్‌లో సానుకూలాంశాలను స్వాగతిస్తున్నాం

- కౌలురైతులను గుర్తించేందుకు విధివిధానాలు రూపొందించాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో సానుకూలాంశాలను భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) స్వాగతించింది. ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అధ్యక్షతన శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశం ఈ మేరకు తీర్మానించింది. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటన విడుదల చేశారు. సాగుచేయని, పడావుబడిన భూములకు, రియల్ ఎస్టేట్ భూములకు రైతుబంధు ఇవ్వబోమంటూ ప్రభుత్వం స్పష్టం చేసిందని తెలిపారు. కౌలురైతులకు చేసిన వాగ్దానం మేరకు రైతుబంధు చెల్లిస్తామని చెప్పిందనీ, దాన్ని సిపిఎం స్వాగతిస్తున్నదని పేర్కొన్నారు. కౌలురైతులను గుర్తించేందుకు విధివిధానాలనూ వెంటనే రూపొందించడం అవసరమని సూచించారు. రుణమాఫీ, మద్దతు ధరల నిర్ణయానికి తగిన విధివిధానాలు రూపొందిస్తున్నామన్నారని, వెంటనే అవి అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గురుకుల విద్యాసంస్థలకు శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించారని పేర్కొన్నారు. విద్యార్థుల భోజనం, తదితర సమస్యల పరిష్కారానికి తగిన నిధులు కూడా కేటాయించటం అవసరమని తెలిపారు.

ఘనంగా ట్రైకలర్ ప్రాపర్టీస్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ : నగర కేంద్రంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న ట్రైకలర్ ప్రాపర్టీస్ 14వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ఆ సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకులు, చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ చందన్ కుమార్ ఝా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజన్ కుమార్ ఝా మాట్లాడుతూ.. 2010లో ప్రారంభించిన తమ సంస్థ అప్పటి నుంచీ వినియోగదారులకు నాణ్యమైన నివాస గృహాలను అందిస్తూ పేరుగాంచిందన్నారు. భారత దేశం అంతటా 20కి పైగా విజయవంతమైన రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌లతో ప్రీమియర్ రియల్ ఎస్టేట్ కంపెనీగా గుర్తింపు పొందిందన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలను అందిస్తున్నామని తెలిపారు. ట్రైకలర్ ప్రాపర్టీస్ పర్యావరణ స్పృహతో పని చేస్తుందన్నారు. ప్రస్తుతం షాద్‌నగర్ వద్ద సఫారన్ రైజ్, శ్రీశైలం హైవే వద్ద కోర్ట్ యార్డ్ పేర్లతో వెంచర్లను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. భవిష్యత్తులో కొనుగోలుదారులకు మరిన్ని ప్రాజెక్టులను అందుబాటులోకి తేనున్నామన్నారు.

సంయుక్త బృందం శాస్త్రీయ గాన గోష్ఠి శ్రావ్యం

ప్రజాశక్తి - కల్చరల్

ప్రముఖ శాస్త్రీయ సంగీత గురువు గానసభ సంగీత కళాశాల అధ్యాపకురాలు సంయుక్త తమ శిష్య బృందంతో కలసి అన్నమయ్య రామదాసు కీర్తనలు శ్రుశ్రావ్యంగా గానం చేశారు. శ్రీ త్యాగరాయ గానసభ నిర్వహణలో విశ్రాంత సివిల్ సర్వీస్ అధికారి డాక్టర్ కె వి రమణ జన్మ దిన సందర్భంగా నిర్వహిస్తున్న కళాసప్తహంలో భాగంగా లలిత కళా వేదిక పై సంయుక్త బృంద గాన గోష్ఠి ఆకట్టుకుంది అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నేటి నిజం సంపాదకుడు బైస దేవదాసు మాట్లాడుతూ సంగీతం మనసుకి విశ్రాంతి ఇస్తుందని అన్నారు. ధనం సంపాదించిన ఎందరో అధికారులు చాలామంది వున్నారని ప్రజల హృదయంలో స్థానం సంపాదించిన వారిలో రమణాచారి ప్రుఖులనీ కొనియాడారు దేశంలో ఎక్కడా ఒక అధికారి పదవీ విరమణ చేసిన తరువాత కూడా రోజుల తరబడి అయన జన్మ దిన వేడుకలు జరపటం వినలేదని అది విక్క రమణాచారి విషయంలో మాత్రమే అన్నారు అయన సహదయత ప్రేమ తత్వం ఇందుకు కారణం అన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ రమణా చారి పట్ల వున్న అభిమానంతో కళా సప్తహం జరిపామని ఇందుకు సహరించిన వారుతో పాటు దినపత్రికల వారికి ధన్యవాదాలు తెలిపారు.

మేడారంలో దుకాణాల కూల్చివేత

- చిరువ్యాపారుల ఆందోళన
- కొలిక్కిరాని దుకాణాల కేటాయింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపార దుకాణాలను శుక్రవారం అర్ధరాత్రి జెసిబిల సహాయంతో అధికారులు కూల్చేశారు. దీంతో చిరువ్యాపారులు అధికారులకు ఎదురు తిరగడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఇదే సమయంలో జిల్లా అదనపు కలెక్టర్ కారును అడ్డగించి నిరసన తెలిపారు. న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ నినాదాలు చేశారు. మహాజాతర సందర్భంగా జాతరలో ఏర్పాటు చేసే దుకాణాల పంపకంలో ఆదివాసీ సంఘాలకు, స్థానిక యువకులకు మధ్య అవగాహన కుదరడం లేదు. దీంతో జాతరలో 100 కోళ్ల దుకాణాలు, 20 బెల్లం, 20 కొబ్బరి, 22 లిక్కర్ దుకాణాలు ఏర్పాటు చేయడంలో జాప్యం జరుగుతోంది. వాస్తవానికి ఈ నెల 7వ తేదీనే ఐటిడిఎ షాపులకు అనుమతులిస్తూ లైసెన్సులు జారీ చేయగా, పంపకాల్లో వచ్చిన గొడవతో ఇప్పటి వరకు ఏర్పాటు కాలేదు.

పూజారులు, సంఘాలకే..

మహాజాతర సందర్భంగా బెల్లం,కొబ్బరి, లిక్కర్, కోళ్ల దుకాణాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులిస్తూ ఐటిడిఎ ద్వారా లైసెన్సులు జారీ చేస్తుంది. నిర్ణీత రుసుం చెల్లించి పూజారుల సంఘంతో పాటు ఆదివాసీ సంఘాల నాయకులు షాపుల లైసెన్సులను పొందుతారు. తరువాత ఫైవ్‌మెన్ కమిటీ ద్వారా ఎవరెవరికి ఎన్ని దుకాణాలను కేటాయించాలో నిర్ణయిస్తారు. అనంతరం లైసెన్సులు పొందిన వారు జాతర పరిసరాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలను ప్రారంభిస్తారు. ప్రతిసారీ పద్ధతి ప్రకారం జాతరలో ఏర్పాటు చేసే షాపులను పూజారులు, ఆదివాసీ సంఘాలు సమానంగా పంచుకుంటాయి. పూజారుల సంఘానికి కొన్ని కేటాయించిన తరువాత మిగిలిన షాపులను వివిధ ఆదివాసీ సంఘాల నాయకులు పంచుకునేవారు. దీని ప్రకారం తొలుత 20 కొబ్బరి, 20 బెల్లం దుకాణాలకు సంబంధించి రూ.14,700 తో బ్యాంకు ద్వారా డీడీలు తీసి ఏటూరునాగారం గిరిజన సమగ్రాభివృద్ధి సంస్థ కార్యాలయంలో సమర్పించారు. ఈ నెల 7వ తేదీన లైసెన్సులు మంజూరు చేసినట్టు అధికారులు తెలిపారు. కాగా, 100 కోళ్ల దుకాణాలు, 22 లిక్కర్ దుకాణాలు అనుమతులు రావాల్సి ఉందని తెలిపారు.

మాకు కూడా కావాలి..

ఈ సారి దుకాణాలు తమకూ కేటాయించాలని మేడారంలోని అభ్యుదయ యువజన సంఘం యువకులు డిమాండ్ చేస్తున్నారు. గత వర్షాకాలంలో జంపన్నవాగు ఉప్పొంగి ప్రవహించడంతో మేడారం వరద ముంపునకు గురైందని, తాము చాలా నష్టపోయామని చెప్పారు. తమకు న్యాయం జరగాలంటే జాతరలో తాత్కలికంగా ఏర్పాటు చేసే కొబ్బరి, బెల్లం లిక్కర్, కోళ్ల దుకాణాలలో కొన్ని కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. పూజారులకు కాకుండా, ఆదివాసీ సంఘాలకు కేటాయించే షాపుల్లో కొన్ని తమకు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో దుకాణాల పంపిణీలో గొడవలు ప్రారంభమయ్యాయి. స్థానిక యువకులకు షాపులు కేటాయిస్తే సంఘాలకు తక్కువ వస్తాయని నాయకులు అభ్యంతరాలు తెలుపుతున్నారు. దీనిపై పూజారులు, ఆదివాసీ సంఘాల నాయకులు, స్థానిక యువత పలుసార్లు సమావేశం అయ్యారు. అయినా దుకాణాల కేటాయింపు కొలిక్కిరాలేదు. ఈ క్రమంలో ఎవరికి వారు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. దాంతో శుక్రవారం అర్ధరాత్రి అధికారులు వాటిని కూల్చేయడంతో ఉద్రిక్తత ఏర్పడింది.

నరేంద్ర మోడీ హటావో

- నూతన జాతీయ విద్యావిధానంతో 'మనుధర్మం' అమలుకు కుట్ర
- విద్యార్థినులకు మల్లు స్వరాజ్యమే స్ఫూర్తి
- ఎస్‌ఎఫ్‌ఐ గర్ల్స్ కన్వీనర్ దీప్సితా ధర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భేటీ బచ్చావో భేటీ పడావో.. దేశంలో నరేంద్ర మోడీ హటావో.. అని ఎస్‌ఎఫ్‌ఐ ఆలిండియా గర్ల్స్ కన్వీనర్ దీప్సితా ధర్ అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెండ్రోజులపాటు నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర గర్ల్స్ కన్వెన్షన్ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా విద్యార్థుల భారీ ర్యాలీ అనంతరం క్లాక్ టవర్ సెంటర్లో బహిరంగ సభ నిర్వహించారు. సభలో ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై వివక్ష రోజు రోజుకూ పెరిగి పోతోందన్నారు. విద్యార్థినులపైనా, మహిళలపైనా లైంగికదాడులు చేసిన వారిని జైల్లో పెట్టకుండా.. నిందితులకు బెయిల్ ఇచ్చి.. వారికి బిజెపి సన్మానాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ భేటీ పడావో భేటీ బచావో అంటూనే ఆడపిల్లలపై చెప్పరాని వివక్ష చూపుతున్నారన్నారు. పోరాటాల పురిటి గడ్డ.. ఉద్యమాల జిల్లా అయిన నల్లగొండ జిల్లాలో 'నా మాటే తుపాకి తూట' అన్న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో విద్యార్థినులు ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు ఈ బహిరంగ సభ ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను మూసేస్తున్నారని, దళిత విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నారని అన్నారు.బిజెపి పాలిత రాష్ట్రాలలోని విద్యాసంస్థల్లో మత ప్రచారాలు చేస్తూ ప్రజల మధ్య విద్వేషాలను రగిలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి మరో మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేసే విధంగా పాఠ్యాంశాలలో చేర్చే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఈ జాతీయ విద్యా విధానం పూర్తిగా పేద విద్యార్థులకు విద్యను దూరం చేసేలా ఉందన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి
ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్‌ఎల్ మూర్తి, తాళ్ల నాగరాజు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీలలో విద్యార్థినుల హక్కులు, సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న సంఘం ఎస్‌ఎఫ్‌ఐ మాత్రమే అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థపై తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఇబ్బందులకు గురి కాకుండా ఉండాలంటే నాణ్యమైన భోజనం పెట్టే విధంగా చర్యలు తీసుకోవలని కోరారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పూజ మమత, జిల్లా గర్ల్స్ కన్వీనర్ కావ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు లక్ష్మి నారాయణ, డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, ఎస్‌ఎఫ్‌ఐ మాజీ నాయకులు కోట్ల అశోక్ రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, శంకర్, స్పందన, అంజలి, బిందు, మాధవి, దేవి, రేణుకా పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతిని వెలిగిస్తున్న సైన్స్ సంబురాలు

- మూఢనమ్మకాలు వద్దు.. సైన్స్ ముద్దు
- జనగామలో జెవివి సైన్స్ ఉత్సవాలు
- విద్యార్థులు సైంటిస్టులుగా ఎదగాలనే ప్రయత్నం
- ప్రజలను చైతన్యం చేసేందుకు జెవివి ప్రయత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాజంలో మూఢనమ్మకాలను దూరం చేసి వాస్తవికత వైపుగా ప్రజలను ఆలోచించేందుకు జనవిజ్ఞాన వేదిక నిరంతరం ప్రయత్నం చేస్తోంది. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని కల్గించి, వారిలో పరిశోధన శక్తి పెంపొందించేందుకు జెవివి కృషి చేస్తోంది. రాష్ట్ర స్థాయి చెక్‌ముకి సైన్స్ సంబురాలు 2024 ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో జనగామ జిల్లా కేంద్రంలోని ఏకశిల విద్యాకళాశాలలో నడుస్తున్నాయి. విద్యార్థులలో ప్రజలకు శాస్త్రీయ దృక్పథం అలవర్చుడానికి రాష్ట్రంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగానే చెక్‌ముకి సైన్స్ సంబురాల నిర్వహణ, విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్షలు నిర్వహిస్తూ వస్తోంది. విజ్ఞాన శాస్త్ర ఫలితాలు అందరికీ అందాలంటే ప్రజలందరూ అక్షరాస్యులు కావాలనే ఆవశ్యకతను గుర్తించి 'అందరికీ విద్య - అందరి బాధ్యత' అనే కార్యక్రమాన్ని జెవివి నిర్వహిస్తోంది. ప్రపంచం సైన్స్ వైపు పరుగు తీస్తుంటే దేశంలో ఇంకా ముఢనమ్మకాలు రాజ్యమేలుతున్నాయి. వీటిని ఆసరగా చేసుకొని దొంగ బాబాలు, బురిడీ బాబాలు సామాన్య ప్రజలను మోసం చేస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ఇకనైనా అనాగరికత నుంచి బయిట పడి ఆచరణమైన వాస్తవమైన సమాజం వైపు అడుగు వేసే దిశగా జెవివి అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా జనగామలో సైన్స్ ఉత్సవాలు జరుపుతోంది.

సైన్స్ ఉత్సవాలు

జనగామ జిల్లా కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెక్‌ముకి సైన్స్ సంబురాలు నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రతిభా పాటవాల పోటీలు, చరిత్ర గతిని మార్చిన శాస్త్రవేత్తల ఎగ్జిబిషన్స్, ఫీల్ట్ ట్రిప్, సైంటిస్టులతో విద్యార్థుల ముఖాముఖి, కండ్లకు గంతలు కట్టుకొని పట్టణ పురవీధుల గుండా బైక్ రైడింగ్, అగ్నికణికలపై నడవడం, మొండంపై తలను వేరుచేయడం తదితర సైంటిఫిక్ ఎగ్జిబిట్స్ ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి. విద్యార్థులు, ప్రజలు ఈ సైన్స్ ఉత్సవాలను అత్యంత ఆసక్తిగా చూస్తున్నారు. వారిని ఆలోచింపజేస్తున్నాయి.

33 జిల్లాల నుంచి విద్యార్థులు

ఈ సంబరాలకు 33 జిల్లాల నుంచి 297 మంది విద్యార్థులు 99 టీములు, 99 మంది గైడ్ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ మూడ్రోజుల్లో విద్యార్థుల ఆలోచనలు సైన్స్ పట్ల ఆసక్తిని కలిగించి వారిని పరిశోధనల వైపు మళ్లించే దిశగా సైంటిస్టులు, మేధావులు తమ విజ్ఞానాన్ని రంగరించి పోస్తున్నారు. అలాగే పట్టణ నడిబొడ్డున స్టాల్స్ ఏర్పాటు చేసి విద్యార్థులను, ప్రజలను శాస్త్రీయ పద్ధతిలో ఆలోచేన చేసే విధంగా ప్రదర్శనలు చేశారు.

35 సంవత్సరాలుగా విజ్ఞానం వైపు ప్రయాణం

విద్యార్థుల్లో సైన్సుపట్ల ఆసక్తిని కలిగించడం, ప్రజల్లో ముఢనమ్మకాలను తొలగించేందుకు 35 సంవత్సరాలుగా జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తోంది. 1988 ఫిబ్రవరి 28 జనవిజ్ఞాన వేదిక పురుడు పోసుకుంది. ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, శాంతి కోసం సైన్స్, దేశం కోసం సైన్స్, స్వావలంభన కోసం సైన్స్ అనే నినాదంతో జెవివి ముందుకు సాగుతోంది.

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం కలిగించేందుకు కృషి
జెవివి రాష్ట్ర అధ్యక్షులు కోయ వేంకటేశ్వర్‌రావు

సామాన్య ప్రజానీకంలో సైన్స్‌శాస్త్రం పట్ల ప్రచారం చేస్తూ రాజ్యాంగం నిర్ధేశించిన శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొనేలా కృషి చేస్తున్నాం. అందులో భాగంగానే 35 సంవత్సవరాలుగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులను పరిశోధనలవైపుగా, ప్రజలను వాస్తవికత వైపుగా మళ్లించేందుకు జెవివి ముందుకు సాగుతోంది. సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం, అశాస్త్రీయ వైద్యాలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తోంది. ప్రజలు మూఢనమ్మకాలను విడనాడి శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలి.

శాస్త్రీయ దృక్పథంలో ఆలోచించండి
సిసిఎంబి రిటైర్ట్ చీఫ్‌సైంటిస్టు ప్రొఫెసర్ రాధారాణి

విద్యార్థులు, ప్రజలు మూఢనమ్మకాలను వీడి నిజ జీవితంలో శాస్త్రీయ దృక్పథంలో ఆలోచించాలి. ప్రపంచం రాకెట్ యుగంవైపు దూసుకు పోతుంటే.. మన దేశంలో ప్రజలు మూఢనమ్మకాలలో మగ్గడం బాధాకరం. తమ చుట్టూ ప్రతి ప్రక్రియ సైన్స్‌తో కూడుకున్నదే. సైన్స్ లేకుండా ఏదీ లేదు. అమ్మతల్లికానీ, పోలియో, కరోనా తదితర భయంకర వ్యాధులకు వాక్సిన్ కనుగొని ప్రజలను సైన్స్ రక్షిస్తోంది. విద్యార్థులు పరిశోధనా కోనంలో ఆలోచించాలి. భవిష్యత్‌కు ఉపయోగ పడేలా పరిశోధనలు చేయాలి.

సైన్స్‌తోనే అభివృద్ధి
ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డాక్టర్ కెఎల్ రఘునందన్

సైన్స్‌తోనే అన్ని రంగాలలో అభివృద్ధి సాధ్యం. స్పేస్ రంగంలో దేశం ముందుకు సాగుతోంది. దీనికి కారణం సైన్స్ పరిశోధనలు. శాస్త్ర సాంకేతిక రంగం మరింత అభివృద్ధి చేందాల్సిన అవసరం ఉంది. సైన్స్ అభివృద్ధి వైపు ప్రయనిస్తే మంచిది. సైన్స్‌ను వినాశనానికి వినియోగిస్తే ప్రయోజనం కన్నా నష్టం ఎక్కువగా ఉంటుంది. అందుకే శాస్ర శాంకేతిక రంగాన్ని మానవ ప్రయోజనాలకు వినియోగించాలి. విద్యార్థులు శాస్త్ర పరిశోధనలవైపు తమ దృష్టిని మరల్చుకోవాలి. జన విజ్ఞాన వేదిక ప్రజలను శాస్త్రీయ దృక్పథంవైపు ఆలోచింపజేసేందుకు చేస్తున్న ప్రయత్నం అభినందనీయం.

NOTICE
BEFORE THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION AT GUNTUR
C.C No: 136/2023
BETWEEN :
Vetcha Venkata Adilakshmi ...Complainant
and
M/s. Sree Sai,Enterprisesand Others ...Opposite Parties
To,
Opp.No-1: M/s. Sree Sai Enterprises, H.No.42, Gun Bazaar, Jagadish Nagar, Rasoolpoora, Secunderabad, Hyderabad, Telangana, rep. by it's Jaganathpur Lokeshwari.
Opp.No-2:M/s. Sree Sai Enterprises, rep. by its Authorized Person,Nune Laxman@Laxmaiah, resident of H.No.23645/4/A/85, Prem Nagar, Amberpeta, Hyderabad, Telangana.
Opp.No:-3: M/s. Sree Sai Enterprises, rep. by its Authorized Person-D.Sailaja GMC Door No.22-19-1309/1, Ward No.4, 3rd Line, Postal Colony, near AlaHospital,Amaravathi Road,Guntur City,Guntur Dt.
పైనెంబరు C.C లో 1 నుండి 3 ఆపోజిట్‌పార్టీలు అయిన మీకు గౌరవ కమీషన్ వారి ద్వారా నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున గౌరవ కమీషన్ వారు మీకు నోటీసును Subsituted Service ద్వారాపేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:23-02-2024న ఉ.గం.10-30 ని. లకు పై తెలిపిన శ్రీయుత కమీషన్ వారి యెదుట మీరు స్వయంగా కానీ, మీ అడ్వకేటు ద్వారా గానీ హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చడ మైనది.
(శ్రీయుత కమీషన్ వారి అనుమతితో)
వాయిదా తేది:23-02-2024.
లంకా విజయ కుమార్,లంకా వంశీ కృష్ణ,
కంప్లైనెంట్ తరపు అడ్వకేట్స్, రవీంద్రనగర్ గుంటూరు,సెల్: 90305 95227

వోల్టా రైడ్‌తో ప్రతిఫలం దక్కుతుంది

- ఆటో డ్రైవర్ల వెల్లడి

హైదరాబాద్ : ప్రముఖ రైడ్ షేరింగ్ స్టార్టప్ సంస్థ 'వోల్టా రైడ్' తమకు వరంగా మారిందని హైదరాబాద్ ఆటో డ్రైవర్లు సంతోషం వ్యక్తం చేసినట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఇటీవల కాలంలో పెరిగిన ఖర్చుల కారణంగా ప్రజలు ఆటో ఎక్కడమే గగనమైందని, ఒకవేళ ఆటో ఎక్కినా ఇతర రైడ్ షేరింగ్ సంస్థలకు ప్రతి రైడ్‌కు కమిషన్‌లు చెల్లించడం తమకు భారంగా మారిందని ఆటో డ్రైవర్లు విచారం వ్యక్తం చేశారని పేర్కొంది. కానీ వోల్టా రైడ్ సంస్థ జీరో కమిషన్ మోడల్‌తో కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపింది. ముఖ్యంగా జీరో కమిషన్ కాన్సెప్ట్ కొత్తగా ఉండడమే కాకుండా తమకు మరింత లాభదాయకంగా మారిందని డ్రైవర్ల సంఘం అధ్యక్షులు మారయ్య, నగేష్‌లు పేర్కొన్నారు. ఉప్పల్‌లో ఆటో యూనియన్ ప్రతినిధులతో వోల్టా రైడ్ సిఇఒ రాజా విక్రమ్, ప్రెసిడెంట్ శశికాంత్‌లు భేటీ అయ్యారని ఆ సంస్థ పేర్కొంది.

హామీల అమలు ప్రస్తావనేది?

- నేమ్ ఛేంజింగే తప్పు...గేమ్ ఛేంజింగ్ కాదు: ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రస్తావన మధ్యంతర బడ్జెట్‌లో లేదని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. శనివారం శాసన మండలి ఆవరణలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నేమ్ ఛేంజింగ్ గవర్నమెంటే తప్ప... గేమ్ ఛేంజింగ్ ప్రభుత్వమనేది కాదని ఎద్దేవా చేశారు. ఆ ప్రభుత్వం పాత పేర్లను మార్చి కొత్త పేర్లు పెడతామంటున్నదే తప్ప.. ప్రగతి గేర్లను మార్చడం లేదని విమర్శించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పేరిట ఆడబిడ్డల వివాహాలకు కెసిఆర్ ప్రభుత్వం రూ.లక్ష చొప్పున అందించేదని గుర్తు చేశారు. దానికి అదనంగా తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని తెలిపారు. బడ్జెట్‌లో దానికి నిధులు కేటాయించకపోవడమే కాకుండా.. కనీసం ప్రస్తావించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశా వర్కర్ల జీతాలను రూ.18 వేలకు పెంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని హామీ ఇచ్చినా బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం శోచనీయమన్నారు. దీనిపై ప్రభుత్వం తన చిత్తశుద్ధిని బడ్జెట్ ద్వారా నిరూపించుకోలేకపోయిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్ దారి చూపిస్తుందని భావించామనీ, కానీ అన్ని వర్గాలను మధ్యంతర బడ్జెట్ నిరాశపరిచిందని తెలిపారు. కేటాయింపులు ముఖ్యం కాదనీ, ప్రభుత్వ దృక్పథాన్ని ఈ బడ్జెట్ సూచిస్తున్నదని చెప్పారు.

అంకెల గారడీ బడ్జెట్

- బిజెపి ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర బడ్జెట్ రాజకీయ ప్రసంగంలా ఉందని, అంకెల గారడీగా ఉందని, అన్ని వర్గాలను నిరాశపరిచిందని బిజెపి ఎమ్మెల్యే మహేశ్వర రెడ్డి అన్నారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రకటించిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చేందుకు ప్రయత్నం చేయడంలేదన్నారు. అంకెల గారడీతో కాంగ్రెస్ డొల్లతనాన్ని బయట పెట్టిందన్నారు. గతంలో హైదరాబాద్‌ను డల్లాస్, ఇస్తాంబుల్ చేస్తామని బిఆర్ఎస్ మభ్యపెట్టిందన్నారు. బిఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ కూడా మోసం చేస్తోందన్నారు. ప్రజలకు ఏమి చేస్తామో చెప్పకుండా కేసీఆర్ పాలనను విమర్శించడంతోనే కాంగ్రెస్ సమయం వృథా చేసిందన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో బడ్జెట్ పెట్టనందున తాము కూడా పూర్తిస్థాయిలో బడ్జెట్ పెట్టలేదనడం ప్రజలను మభ్యపెట్టడ మేనన్నారు. రైతులకు, నిరుద్యోగులకు, మహిళలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. రైతు రుణమాఫీపై మాట్లాడడంలేదన్నారు. రాష్ట్రంలో 56 శాతమున్న బిసిలకు రూ ఎనిమిది వేల కోట్లే కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర సాధనలో ఆర్‌టిసి కార్మికులది కీలక పాత్ర

- వాస్తవాల ప్రాతిపదికన బడ్జెట్ రూపొందించాం
- 'మహాలక్ష్మి' పథకంతో ఆర్‌టిసి బలోపేతం
- కాగితాలపై కాకుండా.. వాస్తవిక బడ్జెట్ పెట్టాం
- ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఆర్‌టిసి కార్మికుల పాత్ర మరువలేనిదని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సకల జనుల సమ్మెతో రాష్ట్ర వ్యాప్తంగా రవాణాను స్తంభింపజేసి రాష్ట్ర సాధన పోరాటానికి సహకరించారని గుర్తు చేశారు. శనివారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో 83 ఎలక్ట్రిక్ బస్సులను సిఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయని భావించినా.. అలా జరగలేదన్నారు. 90 రోజులు సమ్మె చేసినా గత ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించలేదన్నారు. ఆ సమ్మెలో 36 మంది కార్మికులు మరణించినా ఆనాటి ప్రభుత్వం మృతుల కుటుంబాల గురించి ఆలోచించలేదని చెప్పారు. ఆరు గ్యారంటీల్లో మొట్టమొదటి హామీని అమలు చేసిన ఘనత ఆర్టీసీ కార్మికులదే అన్నారు.

గత ప్రభుత్వంలా కాగితాల్లో చూపించినట్టు కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవాల ప్రాతిపదికన రూ.2,75,891 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టామని చెప్పారు. దీన్ని రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం తగ్గినా ఆర్‌టిసికి రూ.281 కోట్లు విడుదల చేస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ఆర్టీసీ బలోపేతానికి ఉపయోగపడిందన్నారు. దేశంలోనే తెలంగాణ మోడల్ పాలనపై చర్చ జరిగేలా పరిపాలన అందిస్తామని హామీనిచ్చారు. ఆర్టీసీ ఎండీ కోరిక మేరకు మరిన్ని బస్సుల కొనుగోలుకు సహకరిస్తామని చెప్పారు.

ఆర్‌టిసిని అద్భుత రవాణా సంస్థగా మారుస్తాం : డిప్యూటీ సిఎం

కార్మికులు ఆర్‌టిసి సంస్థ అస్థిత్వం కోసం ఎన్నో పోరాటాలు చేశారని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆర్‌టిసిని అద్భుత ప్రయాణ సంస్థగా మారుస్తామని చెప్పారు. 'మహాలక్ష్మి' పథకంతో ఆర్‌టిసిపై ఎలాంటి భారం మోపలేదన్నారు. గడిచిన 60 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 15 కోట్ల మంది ప్రయాణికులు ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకున్నారని, ఈ డబ్బును ప్రభుత్వం నేరుగా ఆర్‌టిసికి చెల్లిస్తుందన్నారు. నష్టాల్లో ఉన్న ఆర్టిసి 'మహాలక్ష్మి' పథకం ద్వారా లాభాల్లో నడుస్తోందన్నారు. సంస్థతోపాటు కార్మికులు, ఉద్యోగులను కాపాడుకుంటామని చెప్పారు. నేడు ఆర్టీసీ బలపడుతోందని, మరింత బలోపేతం కోసం పని చేద్దామని పిలుపునిచ్చారు.

మూడు సూత్రాలను పాటిస్తున్నాం : మంత్రి పొన్నం ప్రభాకర్

ఆర్‌టిసిని బలోపేతం చేయడానికి సిఎం సూచన మేరకు 'సంస్థ పరిరక్షణ, సౌకర్యం, కార్మికుల సంక్షేమం' అనే మూడు సూత్రాలను పాటిస్తున్నామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. గతంలో విశ్రాంత ఉద్యోగితో ఆర్‌టిసిని నడిపించడంతో సంస్థ నిర్వీర్యం అయ్యిందన్నారు. రాష్ట్రంలో బస్సులకు బాగా డిమాండ్ పెరిగిందని చెప్పారు. రానున్న రోజుల్లో నియామకాలు చేపడతామని తెలిపారు. మేడారం జాతరకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు వెల్లడించారు. త్వరలోనే కారుణ్య నియామక పత్రాలను అందజేస్తామని తెలిపారు.

'మహాలక్ష్మి'తో ప్రజారవాణాకు మేలు : ఆర్‌టిసి ఎండి సజ్జనార్

మహాలక్ష్మి పథకంతో ప్రజా రవాణాకు మేలు జరుగుతోందని ఆర్టిసి ఎండి సజ్జనార్ అన్నారు. కొత్తగా 100 బస్సులను ప్రారంభిస్తున్నామని, ఇందులో ఎక్స్‌ప్రెస్ బస్సులన్నింటినీ 'మహాలక్ష్మి' స్కీంకి, సూపర్ లగ్జరీ బస్సులను శ్రీశైలంకి నడుపుతామని చెప్పారు. రెండు నెలల్లో ప్రభుత్వం ఆర్టీసీకి రూ.507 కోట్ల నిధులు విడుదల చేసిందని వివరించారు. కొవిడ్, డీజిల్ ధరలు, సమ్మె కారణంగా ఆర్‌టిసి నష్టాలను చవి చూసిందని, ఇప్పుడిప్పుడే కొద్దిగా నష్టాలు తగ్గుతున్నాయని అన్నారు. దాదాపు రూ.115 కోట్ల నష్టాలను తగ్గించామని చెప్పారు. ప్రభుత్వం సహకరిస్తే మరో వెయ్యి బస్సులు కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తామన్నారు. ఆర్‌టిసి ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా తీర్చిదిద్దామని తెలిపారు. అన్ని బస్టాండ్లలో ఉచిత టాయిలెట్స్ ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆర్‌టిసి డ్రైవర్లు, కండక్టర్లను సిఎం సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, బీర్ల ఐలయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌ఎల సమస్యల అధ్యయనానికి కమిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ రెవెన్యూ సహాయకుల (విఆర్‌ఎ) నియామకానికి సంబంధించి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. నెల రోజుల క్రితం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విఆర్‌ఎలకు ఇచ్చిన హామీ మేరకు సర్కార్ ముందడుగు వేసింది. విఆర్‌ఎ నియామకం, ఇతర సమస్యల అధ్యయనానికి కమిటీ వేస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సిసిఎల్‌ఎ కార్యదర్శి నేతృత్వంలో రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జిఎడి కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కమిటీలో సభ్యులుగా ఉంటారు. విఆర్‌ఎ వ్యవస్థ పునరుద్ధరణ, ఇతర విభాగాల్లో సర్వీసులు, చట్టపరిమితి, న్యాయవివాదాలు తదితర అంశాలను ఈ కమిటీ పరిశీలించనుంది. ఈ కమిటీ విఆర్‌ఎల అంశంపై వీలైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

ఎసిబికి చిక్కిన ఎఇ

- కాంట్రాక్టర్ నుంచి రూ.50వేల లంచం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన కాంట్రాక్టర్ నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటూ మున్సిపల్ ఎఇ పృధ్వి శనివారం అవినీతి నిరోధక శాఖకు చిక్కారు. ఎసిబి డిఎస్‌పి కృష్ణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. చేసిన పనులకు బిల్లుల కోసం కాంట్రాక్టర్ మున్సిపల్ ఎఇని సంప్రదించారు. బిల్లు పాసు కావాలంటే రూ. 50 వేల లంచం డిమాండ్ చేశారు. దాంతో ఆ కాంట్రాక్టర్ ఎసిబి అధికారులకు సంప్రదించారు. వారి సూచన మేరకు కాంట్రాక్టర్ ఎఇకి రూ.50వేలు ఇస్తుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

బడ్జెట్‌లో దళితులకు దగా..

- డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో దళితులకు అన్యాయం జరిగిందని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి శంకర్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 15 శాతం ఉన్న దళితులకు రూ.2.75 లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ.40 వేల కోట్లు కేటాయించాలని తెలిపారు. కానీ ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం రూ.21 వేల కోట్లు మాత్రమే కేటాయించారని పేర్కొన్నారు. . అంబేద్కర్ భరోసా పథకం పై సర్కారుకు స్పష్టత లేదని విమర్శించారు.

బ్యాంకులను నిర్వీర్యం చేసే కుట్ర

- హోల్‌సేల్ అమ్మకానికి ప్రభుత్వరంగ సంస్థలు
- సేల్స్‌మెన్‌గా నిర్మలాసీతారామన్!
- అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు ఎన్ శంకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఎఐబిఇఎ జాతీయ ఉపాధ్యక్షులు, అఖిల భారత యూనియన్ బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.శంకర్ అన్నారు. హైదరాబాద్ కాచిగూడలోని మ్యడం అంజయ్య హాల్‌లో శనివారం యూనియన్ బ్యాంకు అవార్డు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రథమ సంయుక్త ప్రాంతీయ ద్వివార్షిక మహాసభ ఎఐయుబిఇఎ కార్యనిర్వాహక అధ్యక్షులు టి రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభను ఎన్ శంకర్ ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ తిరోగమన విధానాలతో భారత ఆర్థిక వ్యవస్థ పూర్తిగా ధ్వంసం అవుతోందన్నారు. లాభాల్లో ఉన్న బ్యాంకులతోపాటు దేశంలో ఉన్న అన్ని ప్రభుత్వరంగ సంస్థలను మోడీ ప్రభుత్వం హోల్‌సేల్‌గా అమ్మకానికి పెట్టిందని, వీటికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నారని ఎద్దేవా చేశారు. "ఒక ప్రభుత్వ రంగ సంస్థ కొంటె మరొకటి ఉచితంగా ఇస్తాం" అని ఆఫర్ ప్రకటించినా ఆశ్చర్యపోనక్కరలేదని అన్నారు. వంద శాతం ప్రజా పెట్టుబడితో లాభాల్లో నడుస్తున్న ఎల్‌ఐసీని ప్రయివేటీకరణ చేయడం దారుణమన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకింగ్‌ను బలహీనపరచడానికి కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల విలీన ప్రక్రియ చేపట్టిందన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఐదు అసోసియేట్ బ్యాంకుల విలీనం తర్వాత, దాదాపు 1,000 శాఖలు మూతపడ్డాయని, బ్యాంక్ ఆఫ్ బరోడాలో దేనా బ్యాంక్, విజయా బ్యాంక్ విలీనంతో 800 శాఖలు మూతపడ్డాయని వివరించారు. ప్రత్యేకించి గ్రామీణ భారతదేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ అందుబాటులో లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయివేటీకరణ వల్ల కార్మికుల ఉద్యోగ భద్రత తుడిచిపెట్టుకుపోగా, నిరుద్యోగ విపత్తు పెరిగిపోయిందన్నారు.

కె భాస్కర్‌రావు మాట్లాడుతూ.. ఆధునిక బ్యాంకింగ్ వ్యవస్థ అత్యంత డైనమిక్, సవాలుతో కూడుకున్నదన్నారు. బ్యాంకింగ్ సిబ్బంది సాంకేతికత, నైపుణ్యం, జ్ఞానాన్ని నిరంతరం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ మహాసభలో యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్, హైదరాబాద్ జోన్ మేనేజర్ కె భాస్కర్‌రావు, యుబిఐ డిప్యూటీ జనరల్ మేనేజర్, హైదరాబాద్ జోన్ ఎ రవి కుమార్, యూనియన్ బ్యాంకు అవార్డు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమద్ ఖాన్, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా హైదరాబాద్ రీజినల్ హెడ్స్ ఎన్ శ్రీనివాస్ రావు, యూనియన్ బ్యాంకు అవార్డు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె రాజగోపాల్, ఉప ప్రధాన కార్యదర్శి కె రాజేందర్, ఉపాధ్యక్షులు సి మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

నిరాశాజనకంగా బడ్జెట్

- బుడ్డర్‌ఖాన్‌లా మాట్లాడుతున్న సిఎం రేవంత్ : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని ఎమ్మెల్యే, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సిఎం బుడ్డర్‌ఖాన్‌లా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. సికింద్రాబాద్‌లోని ఎస్‌విఐటి మహబూబ్ కాలేజ్‌లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన బిఆర్ఎస్ సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు రూ.1.25 లక్షల కోట్లు అవసరమవుతాయని, కానీ బడ్జెట్‌లో రూ.53 వేల కోట్ల మాత్రమే కేటాయించారని తెలిపారు. 200 యూనిట్లకు ఉచిత విద్యుత్ ఇవ్వకపోతే పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ జల హక్కులను కృష్ణాబోర్డుకు అప్పగించడాన్ని నిరసిస్తూ ఈ నెల 13న నల్లగొండలో పెద్దఎత్తున సభ నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే వారి జీవితకాలం సమయం కూడా సరిపోదన్నారు. 100 రోజుల్లో హామీలను అమలు చేయకపోతే వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామన్నారు. హైదరాబాద్ నగరం మాజీ మంత్రి కెటిఆర్ నాయకత్వంలో ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. అందుకే ఇక్కడి ప్రజలు అన్ని అసెంబ్లీ స్థానాలలో బిఆర్ఎస్‌ను గెలిపించారని చెప్పారు. తన గెలుపు కోసం ఎంతో కృషి చేసిన నియోజకవర్గ ప్రజలకు ఏ అవసరమొచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సమావేశంలో సికింద్రాబాద్ ఎమ్మెల్యేలు పద్మారావుగౌడ్, మాగంటి గోపినాద్, దానం నాగేందర్, ముఠా గోపాల్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, కార్పొరేటర్‌లు కొలను లక్ష్మి, టి మహేశ్వరి, కుర్మ హేమలత, బిఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నంలో పురుగులు

- గురుకులంలో తల్లిదండ్రుల ఆందోళన
- బియ్యం మారుస్తామన్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు పెట్టే భోజనంలో పురుగులు వస్తున్నాయని, టిఫిన్ కూడా తినటానికి వీలు లేకుండా ఉంటుందని తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. శనివారం గురుకులంలోకి తల్లిదండ్రులకు అనుమతిస్తారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ద్వారా పురుగుల అన్నం విషయం తెలుసుకున్న వారు ప్రిన్సిపల్ రత్నమాలను అడిగారు. ఈ రోజు అన్నం మెత్తగా అయిందని, బియ్యం మార్చేందుకు ఇండెంట్ పెట్టాం కానీ, హెడ్ ఆఫీస్ నుంచి ఆర్ఒ ఆలస్యం అవుతుందని చెప్పారు. ఆర్ఒ లేకపోతే సివిల్ సప్లై నుంచి బియ్యం రావని, తల్లిదండ్రులు నెలలో మటన్, చికెన్, గుడ్డు మెనూ ప్రకారం పెట్టాలి కదా.. ఎందుకు పెట్టటం లేదని నిలదీశారు. ఉదయం ఏడు గంటలకు టిఫిన్ పెట్టి.. మధ్యాహ్నం భోజనం 1, 2 గంటల మధ్య పెడుతున్నారని చెప్పారు. ఉదయం పెట్టిన టిఫిన్ ఇష్టం లేని వారు కొంచెం మాత్రమే తింటున్న వారు మధ్యాహ్న భోజనం ఆలస్యం వల్ల ఇబ్బంది పడుతున్నారని, ఒక గంట ముందు భోజనం పెట్టాలని కోరారు. ఈ సందర్భంగా పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు డి రామచందు మాట్లాడుతూ.. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఉన్నందున గేట్ కీపర్ నుంచి అధ్యాపకుల వరకూ ఎవరూ ఆమె మాట వినే స్థితి లేదన్నారు. పాఠశాల వాతావరణం అపరిశుధ్యంగా ఉందని, పాములు, తేళ్లు వస్తున్నాయని గత నెలలో విద్యార్థినికి పాము కరిచి ప్రాణాపాయం నుంచి బయట పడిందని చెప్పారు. మెస్ నుంచి డార్మెట్రీకి వెళ్లే దారిలో పాములు, తేళ్లు కుడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో సిసి కెమెరాలు అమర్చినా.. అవి పని చేయాల్సిన చోట పనిచేయడం లేదని తెలిపారు. కూరగాయలు, సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లతో ఏసీటీ కుమ్మక్కై నాణ్యమైన సరుకులు రావటం లేదని, అరటి పండ్లు కూడా విద్యార్థినులకు ప్రత్యేకం అన్నారు. బోధన కూడా సరిగా జరగడం లేదన్నారు. ఈ గురుకుల పాఠశాల కేర్ టేకర్‌పై గతంలోనూ అనేక విమర్శలు వచ్చినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోలేదని చెప్పారు. ముఖ్యంగా మెస్ విషయంలో జిల్లా కలెక్టర్ విపి గౌతంకు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. పాఠశాలలో కోతుల బెడద వేధిస్తున్నట్టు చెప్పారు.

బడ్జెట్ అన్ని వర్గాలను నిరాశపర్చింది

- నిధులు కేటాయించకుండా హామీలు ఎలా అమలు చేస్తారు
- మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర బడ్జెట్ తీవ్ర నిరాశ పరిచిందని, కొండంత చూపి గోరంత కూడా నిధులు కేటాయించలేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ప్రజాపాలన అభాసుపాలు అయ్యిందన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రజాదర్బార్‌ను ప్రతిరోజూ నిర్వహిస్తామని చెప్పారని, కానీ అలా జరగడం లేదన్నారు. ప్రజాపాలనకు ఒక్కరోజు సిఎం పోయారని, మూడ్రోజులు మంత్రులు వెళ్లారని, ఆ తర్వాత అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పరిమితమైందన్నారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, యువతోపాటు రాష్ట్ర ప్రజలందరినీ బడ్జెట్ తీవ్ర నిరాశపర్చిందన్నారు. రైతులకు తగిన నిధులు కేటాయించకుండా పంటల బీమా, మద్దతు ధర, రైతు భరోసా, రుణ మాఫీ ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో, అసెంబ్లీలో సైతం అబద్ధాలే చెబుతోందన్నారు. వ్యవసాయ రంగానికి కేటాయించిన రూ.19 వేల కోట్ల నిధుల్లో రైతు భరోసా ఎలా అమలు చేస్తారన్నారు. రైతు భరోసాకు రూ.22 వేల కోట్లు అవసరమని తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే రూ.82 వేల కోట్లు కావాలని, బడ్జెట్‌లో రూ.16 వేల కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. పంటల బోనస్‌కు రూ.15 వేల కోట్లు, రుణమాఫీకి రూ.40 వేల కోట్లు అవసరమన్నారు. 119 నియోజకవర్గాల్లో 3500 ఇళ్లు ఇస్తామని చెప్పారని, ఇళ్ల నిర్మాణానికి రూ.23వేల కోట్లు కావాలని, అయితే ఇందిరమ్మ ఇండ్లకు రూ.7,100 కోట్లు కేటాయించారని అన్నారు. 24 గంటల కరెంట్ సరఫరాను రాష్ట్రంలో ఎక్కడ ఇస్తున్నారో చూద్దామని, ఎక్కడైనా సరే లాగ్‌బుక్‌లు పరిశీలిద్దాం రావాలని సవాల్ విసిరారు. రైతులకు కెసిఆర్ అండగా నిలిచారన్నారు. ఆరు గ్యారంటీలపై చట్టం చేస్తామని చెప్పారని, కానీ అసెంబ్లీ రెండు సమావేశాలు అయిపోతున్నా అమలు చేయలేదన్నారు. వంద రోజుల్లో హామీలు అమలు చేయలేమని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడే చేతులు ఎత్తేసిందని విమర్శించారు.

జనవరి నెల ఆసరా పింఛన్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టిందని ఆరోపించారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఉద్యోగులకు పిఆర్‌సి, పెండింగ్ డీఎలు ఇవ్వాల్సి ఉన్నా నిధుల కేటాయింపుపై ప్రస్తావనే లేదన్నారు. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు బడ్జెట్‌లో నిధుల్లేవన్నారు. రాష్ట్రంలో 90 లక్షల మంది తెల్లరేషన్ కార్డుదారులున్నారని, వారికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తే దాదాపు రూ.8 వేల కోట్లు కావాలని, కానీ రూ.2400 కోట్లు మాత్రమే కేటాయించారని చెప్పారు. ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని అడిగినా ఆ ప్రస్తావనే లేదన్నారు. గతంలో బిఆర్ఎస్ అప్పులు చేసిందని బదనాం చేశారని, ఈ ప్రభుత్వం చేసేదేమిటని ప్రశ్నించారు. ఇప్పుడు తమకంటే ఎక్కువ రూ.19వేల కోట్లు అప్పులు తెస్తామని బడ్జెట్‌లో పెట్టారని తెలిపారు. ఈసారి అదనంగా బడ్జెట్‌లో రూ.59 వేల కోట్లు ఎలా తెస్తారో సమాధానం చెప్పాలన్నారు. మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వేముల ప్రశాంత్, మధుసూదనాచారి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూముల్లో వెంచర్

- 392/91 సర్వే నెంబర్ భూమికి అప్రోవల్
- వెంచర్ చేసింది 312 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో..
- నాగపూర్ బైపాస్ పక్కన ఐదెకరాల భూదందా
- గుడ్డిగా అప్రోవల్ ఇచ్చిన హెచ్‌ఎండిఎ
- ఫిర్యాదు చేసినా పట్టని రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వం పేదలకిచ్చిన ఇళ్ల స్థలాలు, అసైన్డ్ చేయబడిన ప్రభుత్వ భూముల్ని రెవెన్యూ, హెచ్‌ఎండిఎ అధికారుల నిర్లక్ష్యం వల్ల రియల్టర్లు కాజేస్తున్నారు. ఒక సర్వే నెంబర్‌లోని భూమికి అనుమతి పొంది మరో సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిలో వెంచర్ చేసినా ఎవరూ పట్టించుకోవట్లేదు. బెంగళూరు-నాగపూర్ బైపాస్ వెంట కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూముల్ని మాయం చేస్తున్న వైనం గుట్టుగా సాగుతోంది.

సంగారెడ్డి చుట్టూ పారిశ్రామికాభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. అక్కడి భూముల విలువ అమాంతం పెరిగింది. ఎకరా ధర నాలుగైదు కోట్లు పలుకుతోంది. ప్రభుత్వ భూముల్ని కాజేయడం, పేదలకిచ్చిన ఇళ్ల స్థలాలు, అసైన్డ్ భూముల్ని నొక్కేసే తంతు గుట్టుగా సాగుతోంది. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో కలిసిపోయిన కంది మండలంలోని పలు గ్రామాల్లో అసైన్డ్, పేదలకు పట్టాలిచ్చిన ఇళ్ల స్థలాల కబ్జా దందా జోరుగా సాగుతోంది. హైదరాబాద్-నాగపూర్ జాతీయ రహదారి నిర్మాణమయ్యాక హైవే వెంట ఉన్న భూముల కబ్జాలు ఎక్కువయ్యాయి.

గణేష్ గడ్డ నుంచి ఇస్మాయిల్‌ఖాన్ పేటకు వెళ్లే దారిలో హెచ్‌ఎండిఎ పరిధి కంది మండలంలోని మామిడిపల్లి గ్రామ రెవెన్యూ శివారు 391, 392 సర్వే నెంబర్లలో రవి ధరిత్రి రియల్ ఎస్టేట్ సంస్థ ఐదెకరాల భూమిని కొనుగోలు చేసింది. దానికి సరైన దారి లేకపోవడమే కాకుండా బెంగళూరు-నాగపూర్ బైపాస్‌కు దూరంగా ఉంది. సదరు సంస్థ భూమిని వెంచర్ వేసి ప్లాట్స్ అమ్ముకునేందుకు అంత అనువైందిగా లేదు. దీంతో బెంగళూరు-నాగపూర్ బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న 312 సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూములపై ఆ సంస్థ కళ్లు పడింది. గతంలో ఇందులో మామిడిపల్లి తండాకు చెందిన భూమిలేని పేదలకు అసైన్డ్ చేశారు. దాన్ని పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించాలని కొందరు అర్జీ పెట్టుకున్నారు. అందుకు తమ భూముల్ని ఇచ్చేందుకు పలువురు అసైన్డ్‌దారులు అంగీకరించగా.. ప్రొసీడింగ్ నెంబర్ బి/18276/2008 ద్వారా వారి నుంచి 3.12 ఎకరాల భూమిని అప్పటి సంగారెడ్డి తహసీల్దార్ ప్రభుత్వానికి తిరిగి తీసుకున్నారు. ఆ భూమిలోంచి బైపాస్‌కు ఆనుకుని ఉన్న ఎకరం భూమిని రవి ధరిత్రి సంస్థ వారు కబ్జా చేసి వెంచర్ వేశారు. ఇండ్ల స్థలాల భూమి ఎకరంతోపాటు పక్కనే ఉన్న పలువురు అసైన్డ్‌దారుల నుంచి మరో నాలుగెకరాలను నామమాత్రం డబ్బు ముట్టజెప్పి చట్ట విరుద్ధంగా కొనుగోలు చేశారు. మొత్తం మీద సొంత భూమిని పక్కన పెట్టి ప్రభుత్వానికి చెందిన ఐదెకరాల విలువైన భూమిలో వెంచర్ చేసి వ్యాపారం చేస్తున్నారు.

అనుమతి ఒక చోట వెంచర్ మరోచోట

రవి ధరిత్రి పేరిట చేసిన వెంచర్ అసలు బాగోతం కథ వేరుగా ఉంది. రియల్టర్లు ఎక్కడైనా వెంచర్ చేయాలనుకుంటే తమ భూమి పత్రాలను సమర్పించి అనుమతి కోరుతారు. ఆ పత్రాలను పరిశీలించిన పిదప హెచ్‌ఎండీఎ అధికారులు అప్రోవల్ ఇస్తారు. అదే మాదిరి 391,392 సర్వే నెంబర్లలో రవి ధరిత్రి సంస్థ కొనుగోలు చేసిన ఐదెకరాల భూమిలో వెంచర్ చేయనున్నట్టు అర్జి పెట్టారు. అర్జీని పరిశీలించిన హెచ్‌ఎండిఎ అధికారులు ఫైల్ నెంబర్31/ఎల్‌ఒపిఎల్‌జి మెచ్‌ఎండిఎ/ 2022 ద్వారా అనుమతులు ఇచ్చారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. అసలు లోగుట్టు ఇక్కడే దాగి ఉంది. హెచ్‌ఎండిఎ అప్రోవల్ ఇచ్చిన 392, 391 సర్వే నెంబర్లలోని భూమిలో వెంచర్ చేయకుండా నాగపూర్ బైపాస్‌కు ఆనుకున్న ఉన్న 312 సర్వే నెంబర్‌లోని పేదల ఇళ్ల స్థలాల భూమి, పేదల నుంచి అక్రమ పద్ధతిలో కాజేసిన అసైన్డ్ భూమిలో రవి ధరిత్రి పేరిట వెంచర్ చేశారు. ఐదెకరాల్లో వెంచర్ వేసిన సదరు ప్రయివేట్ సంస్థ ప్లాట్లను విలువైన ధరకు అమ్ముకుని కోట్లు గడిస్తోంది. ఆ ప్రాంతంలో ఎకరం భూమి రూ.15 నుంచి రూ.20 కోట్ల వరకు ధరలున్నాయి. ఒక చోట అనుమతి పొంది మరో చోట వెంచర్ చేసిన లోగుట్టు గురించి హెచ్‌ఎండిఎ క్షేత్ర పరిశీలన చేసిన పాపాన పోలేదు. కనీసం రెవెన్యూ అధికారులైనా పట్టించుకోవట్లేదు.

రూ.20 కోట్ల విలువ చేసే భూములు మాయం

కంది మండలంలోని పలు గ్రామాల్లో కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములు కబ్జాల పాలవుతున్నాయని స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవట్లేదు. అసైన్డ్ చేయబడిన భూములు అమ్మినా కొన్నా చట్టరిత్యా చెల్లదు. కానీ, 312 సర్వే నెంబర్‌లో ఉన్న ఐదెకరాల భూమిని ప్రయివేట్ రియల్ ఎస్టేట్ సంస్థ కాగితాల మీద కొనుగోలు చేసినట్టు మార్పిడి చేసుకుని వెంచర్ చేసి అమ్ముకుంటున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. పలువురు స్థానికులు కలెక్టర్, తహసీల్దార్‌కు పలుమారు ఫిర్యాదు చేశారు. విచారణ చేస్తామని చెప్పినా ఇప్పటి వరకు పట్టించుకోలేదు.